క్లుప్తంగా

సంపూర్ణ ఆరోగ్యం ముఖ్యం



మద్నూర్(జుక్కల్): సంపూర్ణ ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ఎంతో ముఖ్యమని డాక్టర్ నాగార్జున అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆరోగ్య సూత్రాలు తెలుసుకోవాలన్నారు. వైద్యుల సలహామేరకు శరీరానికి కావాల్సిన మినరల్స్ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి మందులు అందించారు. ఫార్మసిస్ట్ లావణ్య, ప్రిన్స్‌పాల్ గంగాకిషోర్, ఉపాధ్యాయులు వెంకట్, సుమన్, వేణుగోపాల్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

పాఠశాలకు రూ. 35 వేలతో పెయింటింగ్

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు రూ.35 వేలు వెచ్చించి రంగులు వేయించారు. పాఠశాల ప్రహరీతో పాటు, అన్ని తరగతి గదులకు పెయింటింగ్ చేయించారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సంపత్, ప్రతినిధులు ల్యాబ్ శ్రీధర్, లింగం, రాజు, శ్రీకాంత్, ప్రేమ్‌రాజు, ముదాం శ్రీధర్ నీల చంద్రశేఖర్, శ్రీరామ్ శేఖర్, భూమయ్య, పోషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యుడు రవీందర్ పటేల్ 136 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. నలుగురికి కంటిశస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి కామారెడ్డి ఆస్పత్రికి సిఫారసు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు పుస్తకాల(ఆల్ ఇన్ వన్)ను పంపిణీ చేసినట్లు ఎంఐఎం నాయకులు రజాక్ బుధవారం తెలిపారు. ఎంఐఎం పార్టీ తరఫున ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఆల్ ఇన్ వన్ మెటీరియల్ అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో వెంకటేశం, ఎంఐఎం నాయకులు కలీమ్, రహమాన్, అబ్బాస్ తదితరులున్నారు.

సీడీసీ సభ్యుల ప్రమాణస్వీకారం



కామారెడ్డి టౌన్: నూతనంగా నియమితులైన చెరుకు అభివృద్ధి సంఘం(సీడీసీ) అధ్యక్షుడు ఇర్షాదుద్దీన్, డైరెక్టర్లు పీర్‌రెడ్డి, గడ్డం నరేందర్‌రెడ్డిలు బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కేన్ కమిషనర్ వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) నూతన కమిటీని జిల్లా కార్యదర్శి అజయ్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ అశ్వక్, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఉదయ్‌కుమార్, రాము, సహాయ కార్యదర్శులుగా రాకేష్‌రెడ్డి, ఇమ్రాన్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు.



నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లిలో అల్లమా ప్రభు ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



దోమకొండలోని కటికం మల్లేశుడి ఆలయం వద్ద భక్తులు



రామారెడ్డి: బుగ్గరామలింగేశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఘనంగా మాఘ అమావాస్య

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నదులు, చెరువుల వద్ద పుణ్యస్నానాలు
- పలు చోట్ల అన్నదానాలు
- వెలసిన దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా మాఘ అమావాస్య వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. నదులు, చెరువుల వద్ద పుణ్యస్నానాలు చేసి ఆలయాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు సమీపంలో పెద్ద ఎత్తున జాతరలు వెలిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పెద్దమల్లారెడ్డిలో దేవేంద్రుడి గుట్టపై ఉన్న స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



రాజంపేటలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు



నాగిరెడ్డిపేట: తెప్పపై మంజీర నది దాటి శివాలయానికి వస్తున్న మెదక్ జిల్లా భక్తులు



సలాబత్‌పూర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మాచారెడ్డి: గజ్యానాయక్‌తండాచౌరస్తాలో వెలసిన జాతరలో భక్తుల సందడి



ఎల్లారెడ్డి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లింగంపేట: అన్నదానం చేస్తున్న మ్యాదం వెంకటలక్ష్మి, రవికుమార్ గుప్తా దంపతులు



లక్ష్మీదేవునిపల్లిలో లక్ష్మీనర్సింహస్వామికి పూజలు

కిటకిటలాడిన భీమేశ్వరాలయం



సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు



భీమేశ్వరాలయంలో పూజుల చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని శివాలయాలలో మాఘ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సంతాయిపేట్ శివారులోగల భీమేశ్వరాలయానికి భారీగా భక్తులు పోటెత్తారు. ఉత్తరం నుంచి దక్షిణం వైపు ప్రవహిస్తున్న పవి వాగులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం క్యూలో నిలుచుని స్వయంభూలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 6 లక్షల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్, మాజీ ఎమ్మెల్యే సురేందర్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భీమేశ్వరాలయం వరకు ప్రత్యేక బస్సులు

కామారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి తాడ్వాయి మీదుగా సంతాయిపేట్ భీమేశ్వరాలయం వరకు ప్రత్యేక బస్సులను వేశారు. అరగంటకు ఒక సారి బస్సులను నడిపించడంతో భక్తులకు ఇబ్బంది కలగలేదు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

భీమేశ్వర ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన సంతాయిపేట్ భీమేశ్వరాలయంలో నిర్వహించిన ఉత్సవాలకు హాజరై మాట్లాడారు. భక్తుల తాగు నీటి కోసం బోరు వేయిస్తానని, వంటగది ఏర్పాటుతో పాటు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తానని అన్నారు. జాతరలో అన్నదాన కోసం అవసరమైన బియ్యాన్ని పంపిస్తానని హామీ ఇచ్చారు.

నాగమడుగులో పుణ్యస్నానాలు



నిజాంసాగర్(జుక్కల్): మాఘ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం అచ్చంపేట గ్రామ శివారులో గల నాగమడుగు మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రతీ ఏటా మాఘ అమావ్య రోజున స్నానాలు ఆచరించి నాగజముడు, శివయ్యకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సారి పుణ్య స్నానాలకు రెండు, మూడు వేల మంది భక్తులు తరలి వచ్చారు. అచ్చంపేట గ్రామ భజన మండలి ఆధ్వర్యంలో నాగమడుగు వద్ద భక్తులకు ఉచిత అన్నప్రసాదం వితరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

‘ముందస్తు ప్రవేశాలు తీసుకోవద్దు’

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు 2025–26 సంవత్సరానికి సంబంధించిన ముందుస్తు ప్రవేశాలు తీసుకోకూడదని, ఒక వేళ తీసుకున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఎల్లయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ముందస్తు ప్రవేశాలు తీసుకుంటున్నట్లు మాదృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

‘పోషక లోపం పెరుగుతోంది’



సదాశివనగర్: పిల్లల్లో పోషక లోపం పెరుగుతోందని, దానిని నివారించడానికి కృషి చేయాలని డీపీఎం రమేష్ బాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పిల్లల్లో పోషక లోపాన్ని నివారించడంపై డీపీఎం రమేష్ బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో పోషక లోపాన్ని సాధారణ, ఆరోగ్య, పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చని సూచించారు. ఏపీఎం రాజిరెడ్డి, అంగన్‌వాడి సూపర్వైజర్ పద్మ, పద్మావతి, సీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఎర్రాపహాడ్‌లో బుధవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. సింగిల్‌విండో చైర్మన్ కపిల్ రెడ్డి, ఏవో నర్సింలు, కార్యదర్శి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన పీఆర్‌సీ సభ్యులు



మాచారెడ్డి: మాచారెడ్డి పీహెచ్‌సీని బుధవారం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్‌సీ) సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, పంపిణీ చేస్తున్న మందులు, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆదర్శ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పాల్వంచ మండల కేంద్రంలో పల్లె దవాఖాన, భవానీపేటలోని ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. వారి వెంట సీహెచ్‌వో వెంకటేశ్వర్ రావ్, సిబ్బంది ఉన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి ఇన్‌చార్జీల నియామకం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ కుమ్మరి యాదగిరి ఆధ్వర్యంలో సమితి నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించారు. సమితి జుక్కల్ నియోజకవర్గ కో–ఇన్‌చార్జిగా మేకల లక్ష్మణ్ యాదవ్, పిట్లం మండల ఇన్‌చార్జీగా ఎర్ర రమేశ్‌లను నియమిస్తూ పత్రాలు అందించారు.

సమాచారం..

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే రాక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల కేంద్రానికి నేడు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రానున్నట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం తెలిపారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

కుంభమేళాలో పీఠాధిపతి పూజలు



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద బండాయప్ప మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్య స్వామిజీ ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాను దర్శించుకొని గంగా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. పవిత్రమైన కుంభమేళా ఈ తరానికి దక్కడం అదృష్టంగా భావించాలని ఈ అవకాశం అందరికి లభించదని అన్నారు. భక్తులకు కుంభమేళా విశిష్టత గురించి వివరించి ప్రవచనాలు చేశారు.

‘అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం’



సమీక్షలో పాల్గొన్న ఇంజనీరింగ్ అధికారులు

కామారెడ్డి అర్బన్: వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లాలోని వివిధ సర్కిల్ అధికారులతో ఎస్ఈ శ్రావణ్‌కుమార్, నోడల్ అధికారి బి.శ్రీనివాస్ వేసవి కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. పురోగతిలో ఉన్న పనులు, చేపట్టాల్సిన చర్యలు, లోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. కామారెడ్డి నుంచి దోమకొండకు రూ. 4.2 కోట్ల వ్యయంతో వేసిన ప్రత్యామ్నాయ లైన్ ద్వారా దోమకొండ, భిక్కనూరు, బీబీపేట్, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి మండలాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. వేసవి విద్యుత్ కార్యాచరణ సమీక్ష సమావేశలో విద్యుత్ వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా’



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య ప్రచారం నిర్వహించారు. వాకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లం రాఘవరెడ్డి, తదితరులున్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



భిక్కనూరు: మండల కేంద్రంలో మూడు రోజులుగా ఈగల్ క్రికెట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం మాజీ సర్పంచ్ తున్కి వేణు బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని దోమకొండ జట్టు, ద్వితీయ బహుమతి ఇసన్నపల్లి జట్టు గెలుచుకున్నాయి. వీరికి మెమెంటోలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.

కబ్జాకు గురైన కాలువకట్ట స్థలం పరిశీలన



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రధానకాలువ కట్ట స్థలాన్ని బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు పరిశీలించారు. పోచారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాలువకట్ట స్థలాన్ని కబ్జా చేశారని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సర్వేయర్ కరుణాకర్ కాలువ కట్ట స్థలాన్ని పరిశీలించారు. హద్దులను గుర్తించారు. కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఆర్ఐ మహ్మద్, ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



కామారెడ్డి అర్బన్: నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం ప్రతిని కలెక్టర్‌కు అందజేశారు. సంఘం అధ్యక్షుడిగా బట్ట రాజు, గౌరవ అధ్యక్షుడిగా కరీం, ఉపాధ్యక్షులుగా నవీన్‌కుమార్, సరళ, కార్యదర్శిగా స్వామి, కార్యవర్గసభ్యులుగా ప్రకాష్, అభిలాష్, గణేష్, గంగమణి, భాను, ఆశయ్య, భాను, ఇంతియాజ్‌లు ఎన్నికయ్యారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల రాస్తారోకో



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు బుధవారం ధర్నా చేశారు. డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి హక్కుపత్రాలను లబ్ధిదారులకు అధికారులు అందించాలని డిమాండ్ వారు చేశారు. హక్కు పత్రాలు, ఇంటి తాళాలు అందించేంత వరకు ధర్నా కొనసాగిస్తామని అన్నారు. హక్కు పత్రాలను సోమవారం నుంచి అందిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ సూచించడంతో లబ్ధిదారులు ధర్నా విరమించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శించారు. బుధవారం జుక్కల్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రస్తుత ఎమ్మెల్యే విస్మరించారని ఎండగట్టారు. బీఆర్ఎస్ నాయకులు నీలు పటేల్, భానుగౌడ్ తదితరులున్నారు.

ఎస్జీటీ సంఘం సభ్యత్వ నమోదు



సభ్యత్వ కార్డులు చూపెడుతున్న ఎస్జీటీలు

బాన్సువాడ: సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) సంఘం సభ్యత్వ నమోదును బుధవారం బాన్సువాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ.. ఎస్జీటీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు, ఎస్జీటీలకు మధ్య పీఆర్సీ వ్యత్యాసంలో తేడాను తగ్గించాలని అన్నారు. ఎస్జీటీలు పవార్ హీరాలాల్, హన్మాండ్లు, సంజయ్, పండరి, నాగరాజు, శ్రీనివాస్‌నాయక్, విఠల్‌యాదవ్, శ్రీకాంత్, అనిల్, లక్ష్మణ్, రాగిణి తదితరులున్నారు.